## బైక్ అదుపు తప్పి కర్ణాటక వాసి మృతి

పరిగి, డిసెంబర్ 15: మోటార్‌సైకిల్ అదుపుతప్పి కింద పడిపోవడంతో కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన పరిగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతల్‌చెరువు సమీపంలో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. ఎస్‌ఐ సంతోష్‌కుమార్ కథనం ప్రకారం కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లాలోని గోపన్‌పల్లి గ్రామానికి చెందిన రాజూ నాయక్ దంపతులు హైదరాబాద్‌లోని గోల్కొండలో ఐదు సంవత్సరాలుగా నివాసముంటూ కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం రాజూనాయక్ తన స్నేహితుడి దగ్గర మోటార్‌సైకిల్ తీసుకొని చిన్న కొడుకు దేవురాజ్‌ను తీసుకురావడానికి సొంత ఊరు గోపన్‌పల్లికి వెళ్తుండగా చింతల్ చెరువు సమీపంలోని రోడ్డు మలుపు వద్ద మోటార్‌సైకిల్ అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో రాజూనాయక్ తీవ్ర గాయాలై చనిపోయాడు. ఆయన భార్య సావిత్రమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### ప్రమాదవశాత్తు ఇంటికి నిప్పు..

కొడంగల్, డిసెంబర్ 15: దేవుడి ముందు వెలిగించిన దీపం కిందపడి మంటలు చెలరేగి నష్టం వాటిల్లిన ఘటన మండలంలోని టేకల్‌కోడ్ గ్రామంలో ఆదివారం జరిగింది. బాధితురాలు యాదమ్మ కథనం ప్రకారం.. రోజు మాదిరిగానే ఇంట్లో దేవుడికి దీపం పెట్టి, పొలం పనులకు వెళ్లామని, దీపం కిందపడి మంటలు అంటుకొన్నట్లు తెలిపారు. ఇంట్లో ఉన్న రూ.30వేలతో పాటు జొన్నలు, బియ్యం, పప్పు గింజలు కాలి బూడిదైనట్లు వాపోయారు. కొడంగల్ పట్టణంలోని అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందించడంతో మంటలు అదుపు చేసినట్లు తెలిపారు.

### అనాథ మృతదేహానికి అంత్యక్రియలు..

కొడంగల్, డిసెంబర్ 15: అనాథ మృతదేహానికి అమ్మానాన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం అంత్యక్రియలు చేపట్టారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రెండేళ్ల క్రితం కొడంగల్‌కు వచ్చి భిక్షాటన చేస్తూ జీవించేవాడని తెలిపారు. కొన్ని రోజుల క్రితం మతిస్థిమితం కోల్పోయి రోడ్డుపై పడిపోవడంతో తమ బృందం సభ్యులతో కలిసి మెడికల్ అధికారుల సహకారంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్సను అందించినట్లు తెలిపారు. ఆదివారం చనిపోవడంతో పోలీసుల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించినట్లు తెలి పారు.

### స్నానానికి వెళ్లిన వ్యక్తి కాగ్నావాగులో గల్లంతు

ధారూరు,డిశంబర్ 15: స్నానానికి వెళ్లిన వ్యక్తి గల్లంతు అయిన ఘటన ధారూరు మెథడిస్ట్ క్రిస్టియన్ జాతర సమీపంలో చోటుచేసుకుంది. ఆదివారం స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని ధారూరుస్టేషన్– దోర్నాల్ గ్రామాల మధ్య ఉన్న కాగ్నా వాగులో సంగారెడ్డి జిల్లా కోహీర్ కు చెందిన ముక్కలి రాహుల్ (20) వాగులో స్నానానికి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆయన సంబంధీకులు వచ్చి పరిశీలించారు. వాగు ఒడ్డున ఆ వ్యక్తి బట్టలు, సెల్ ఫోన్ ఉండడం చూసి వాగులో తప్పిపోయాడని స్థానికులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

### పాముకాటుకు గురైన యువతి మృతి

తాండూరు రూరల్, డిసెంబర్ 15: పాముకాటుకు గురైన ఓ యువతి ఆదివారం మృతి చెందింది. మెరుగైన వైద్యం అందకపోవడంతో యువతి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. కొడంగల్ నియోజకర్గంలోని నందారం గ్రామానికి చెందిన బుడిగజంగం సంగీత (18)కు శనివారం పాముకాటు వేసింది. దాంతో తల్లి రంగమ్మ కొడంగల్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం, తాండూరులోని జిల్లా దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించాలని వైద్యులు సూచించారు. కొంత సేపు అంబులెన్స్ కోసం బంధువులు ఎదురు చూశారు. అంబులెన్స్ సిద్ధం చేస్తుండగానే సంగీత మృతి చెందినట్లు బంధువులు ఆరోపించారు.

### నేడు బీఆర్‌ఎస్ సమావేశం.

కొడంగల్, డిసెంబర్ 15: పట్టణంలోని మంజునాథ బ్యాంకెట్ హాల్‌లో సోమవారం ఉదయం 11 గంటలకు బీఆర్‌ఎస్ ముఖ్య నాయ కులు, కార్యకర్తల సమావేశం జరుగనున్నట్లు మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధి లోని మాజీ జడ్పీటీసీలు, మాజీ వైస్ ఎంపీపీలు, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, పీఏ సీ ఎస్ అధ్యక్షులు, డైరెక్టర్‌లతో పాటు బీఆర్ ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు విధిగా పాల్గొనాలని కోరారు.ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్న కుమారుడు షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

### ఆర్థిక సాయం

కులకచర్ల, డిసెంబర్ 15: కులకచర్ల మండల పరిధిలోని ఇప్పాయిపల్లి గ్రామంలో పోటి లక్ష్మమ్మ అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె అంత్యక్రియలకు మూడు వేల రూపాయలు గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ కురుంపల్లి నర్సింహులుగౌడ్ మృతు రాలి కుటుంబానికి అందజేశారు.

## ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



పరిగి మండలం మాదారం గ్రామంలో నూతనంగా నిర్మాణం చేపట్టిన గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో ఆదివారం శాసన మండలిలో విపక్ష నాయకులు, ఎమ్మెల్సీ మధుసూదనాచారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ మధుసూదనాచారిని ఆలయ కమిటీ వారు ఘనంగా సన్మానించారు. ఈ ఉత్సవాలలో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మాజీ జడ్పీటీసీ బి.హరిప్రియ, మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఆర్.ఆంజనేయులు, సీనియర్ నాయకులు బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాములు, పీఏసీఎస్ డైరెక్టర్ ఈశ్వరప్ప, గ్రామస్తులు పాల్గొన్నారు.

-పరిగి, డిసెంబర్ 15

## బోనమెత్తి..స్వామిని స్మరించి..



తాండూరు రూరల్, డిసెంబర్ 15 : తాండూరు మండలం, గౌతాపూర్‌లోని శ్రీ మల్లికార్జున స్వామి జాతర ఆదివారం వైభవంగా జరిగింది. మధ్యాహ్నం స్వామి గంగాస్నానం, అనంతరం సాయంత్రం గ్రామంలోని మహిళలు బోనమెత్తి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. డప్పువాయిద్యాలతో పెద్ద ఎత్తున మహిళలు బోనమెత్తారు. స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల కలుగకుండా నిర్వహకులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. పూజారి పత్తిచంద్రప్ప ఆధ్వర్యంలో జాతర జరిగింది.

## సమగ్రాభివృద్ధే.. ప్రధాన లక్ష్యం

### ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



గాంధీనగర్ కాలనీలో కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం, డిసెంబర్ 15 : నియోజకవర్గం సమగ్రాభివృద్ధే ప్రధాన లక్ష్యమని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ గాంధీనగర్‌లో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అవకాశమున్న ప్రతి కాలనీలోనూ కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవాలని, దానికి సహకారం అందిస్తామన్నారు. కాలనీ ప్రజలు, మహిళలు, వయో పౌరులు సమావేశాలు నిర్వహించుకోవాడానికి కమ్యూనిటీ హాళ్లు ఉపయోగపడతాయన్నారు. ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేస్తున్నామన్నారు. కాలనీవాసులు తమ దృష్టికి తీసుకువచ్చిన అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ముంపు సమస్యను పూర్తిగా పరిష్కరించామని గుర్తు చేశారు. జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని, నిధులు ఇవ్వకుండా అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, ముద్దగౌని సతీశ్ కుమార్‌గౌడ్, జగన్మోహన్‌రావు, గంగం శివశంకర్, సతీశ్ చౌదరి, సుమన్‌గౌడ్, మల్లారెడ్డి, నర్సింహా రెడ్డి, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

## కార్ సర్వీసింగ్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం



బండ్లగూడ, డిసెంబర్ 15: ఓ కారు సర్వీసింగ్ సెంటర్‌లో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకున్నది. వివరాలిలా ఉన్నాయి. అత్తాపూర్ హైదర్‌గూడలోని నెక్స్ట్ జెన్ కార్ సర్వీసింగ్ సెంటర్‌లో నాలుగు కార్లకు మంటలు అంటుకున్నాయి. ఈ ప్రమాదంలో ఒక కారు పూర్తిగా దహనం కాగా, మరికొన్ని కార్లకు మంటలు ఉండగా స్థానికులు వెంటనే అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. ఆదివారం కావడంతో సర్వీసింగ్ సెంటర్ మూసి ఉన్నది. సమాచారం అందుకున్న అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రాజేంద్రనగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వైభవంగా గిరి ప్రదక్షిణ



కులకచర్ల, డిసెంబర్ 15 : పౌర్ణమి సందర్భంగా మండల పరిధిలోని బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో గిరిప్రదక్షిణలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయంలో శ్రీ రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ఆ కేంద్రం.. గ్రూప్-2 అభ్యర్థులకు శాపం

- 'కేజీ రెడ్డి, గ్లోబల్ ఇంజినీరింగ్'లో పార్కింగ్‌కు పరీక్షకు.. అర కిలోమీటరు దూరం
- ఏర్పాట్లు చేయని అధికారులు
- నిమిషం ఆలస్యమైనా అనుమతించని నిర్వాహకులు
- తీవ్ర అసహనం వ్యక్తం చేసిన అభ్యర్థులు




సిటీబ్యూరో, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ): నగర శివారులోని మొయినాబాద్‌లో కొన్ని 'గ్రూప్–2' పరీక్షా కేంద్రాలు అభ్యర్థుల పాలిట శాపంగా మారాయి. ఆ కేంద్రాల్లో పరీక్షలు రాయాలంటే అభ్యర్థులు, వారి వెంట వచ్చిన కుటుంబసభ్యులు అర కిలోమీటరుకు పైగా నడవాల్సిందే. సొంత వాహనాలున్నా, క్యాబ్‌లో వచ్చినా అరకిలో మీటరు దూరంలోనే వాహనాలను పార్క్ చేసి పరీక్షా కేంద్రాలకు నడుచుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి. ఇది ఎక్కడో మారుమూల గ్రామంలో అనుకుంటే పొరపాటే. మహానగరానికి ఆనుకుని ఉన్న మొయినాబాద్‌లోని కేజీ రెడ్డి, గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాల గ్రూప్–2 ఎగ్జామ్ సెంటర్లలో నెలకొన్న దుస్థితి. వివరాల్లోకి వెళితే... మొయినాబాద్‌లోని కెజి.రెడ్డి, గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలల్లో గ్రూప్–2 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఆదివారం గ్రూప్–2 పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థుల వాహనాలకు సరైన పార్కింగ్ స్థలంలేదని పోలీసులు పరీక్షా కేంద్రానికి అరకిలో మీటరుకు పైగా దూరంలోనే పార్క్ ఏర్పాటు చేయించారు. దీంతో పరీక్ష రాసే అభ్యర్థులు, వారి వెంట వచ్చిన కుటుంబసభ్యులు గత్యంతరం లేక దాదాపు 700 మీటర్ల దూరంలోనే వాహనాలను పార్క్‌చేసి కాలినడకన పరీక్షా కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చిందని అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక నిమిషం ఆలస్యమైతే పరీక్షా కేంద్రంలోకి అనుమతించమని ఒక పక్క టీజీపీఎస్‌సీ అధికారులు నిబంధనలు విధిస్తుండగా.. మరో పక్క పోలీసులు అభ్యర్థుల వాహనాలను పరీక్షా కేంద్రానికి అరకిలో మీటర్ దూరంలోనే నిలిపి వేయడమేంటని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. వాహనాలు పార్క్ చేసిన ప్రాంతం నుంచి పరీక్షా కేంద్రానికి కాలినడకన చేరుకునేందుకు దాదాపు 10 నిమిషాల సమయం పడుతుందని, దీని వల్ల వివిధ కారణాలతో చివరి నిమిషంలో పరీక్షా కేంద్రానికి చేరుకునే అభ్యర్థులు 'నిమిషం నిబంధన'కు బలై సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోలేని పరిస్థితి లేకపోలేదని, గతంలో అక్కడ జరిగిన పలు పోటీ పరీక్షలు, టీజీపీఎస్‌సీ పరీక్షలు రాసిన పలువురు అభ్యర్థులు ఈ అరకిలోమీటర్ నడక కారణంగా సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోలేని సందర్భాలున్నట్లు అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

### పార్కింగ్ స్థలం లేని కేంద్రాలు ఎందుకు?

గ్రూప్–1, గ్రూప్–2 వంటి పరీక్షా కేంద్రాలకు పరీక్షలు రాసే అభ్యర్థులు దూర ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఇందులో భాగంగా చాలా మంది అభ్యర్థులు సొంత వాహనాలపై చేరుకోగా మరికొందరు క్యాబ్‌లు, ఆటోల్లో వస్తారు. అయితే పరీక్ష రాసేందుకు వచ్చిన అభ్యర్థులకు సరైన పార్కింగ్ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత అటు సెంటర్ నిర్వాహకులు, టీజీపీఎస్‌సీ అధికారులు, పోలీసులపైన ఉంటుంది. కానీ అధికారుల మధ్య కొరవడిన సమన్వయ లోపం వల్ల గత కొంత కాలంగా పార్కింగ్ సౌలభ్యం లేని కేజీ.రెడ్డి, గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలల్లో గ్రూప్–1, గ్రూప్–2 వంటి ప్రతిష్టాత్మకమైన పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం వల్ల అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, పార్కింగ్ స్థలంలేని కళాశాలల్లో ఎగ్జామ్ సెంటర్లను ఎందుకు ఏర్పాటు చేస్తున్నారని అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### స్థలం లేకనే దూరంగా పార్కింగ్: డీసీపీ చింతమనేని శ్రీనివాస్

కెజి.రెడ్డి, గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలు ఇరుకైన సందులో ఉండటం, అక్కడ సరైన పార్కింగ్ స్థలం లేకపోవడం వల్లనే వాహనాలను కొంత దూరంలో పార్కింగ్ చేయిస్తున్నాం. ఈ రెండు పరీక్షా కేంద్రాలు ఇరుకైన సందులో ఉండటం, అక్కడ పార్కింగ్ స్థలం లేకపోవడంతో అభ్యర్థులందరూ ఒక్కసారిగా వాహనాలతో వస్తే తీవ్ర ట్రాఫిక్‌జామ్ ఏర్పడే అవకాశముంది. దీంతో అభ్యర్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకోలేరు. అందుకని వారికి ట్రాఫిక్ ఆటంకాలు ఏర్పడకూడదనే అభ్యర్థుల వాహనాలను పరీక్షా కేంద్రాలకు కొంత దూరంలోనే నిలిపివేస్తున్నాం. పరీక్షకు గంట ముందుగా వచ్చిన అభ్యర్థుల వాహనాలను మాత్రమే దూరంగా పార్క్ చేయిస్తున్నాం.. ఆలస్యంగా వచ్చిన అభ్యర్థుల వాహనాలను మాత్రం పరీక్షా కేంద్రం వరకు అనుమతిస్తున్నాం. అవసరమైతే స్వయంగా తమ సిబ్బందితో పోలీసు వాహనాల్లో పరీక్షా కేంద్రాలకు చేరవేసేలా చర్యలు చేపట్టాం. రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో గ్రూప్–2 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉదయం నుంచి నేను స్వయంగా పరీక్షా కేంద్రాలను సందర్శించి, అభ్యర్థులకు ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షించా ను. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద సంబంధిత ఠాణాకు చెందిన సీఐ, ఎస్‌ఐ స్థాయి అధికారులు బందోబస్తు చర్యలు నిర్వహిస్తున్నారు.

## మాజీ ఎమ్మెల్యే ఇంట్లో చోరీ

బంజారాహిల్స్, డిసెంబర్ 15: కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ ఇంట్లో రూ.7.50లక్షల నగదు మాయమైంది. ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఘటన వివరాలిలా ఉన్నాయి. జూబ్లీహిల్స్‌లోని న్యాయవిహార్ కింది భాగంలోని భరణి లే అవుట్‌లో నివాసం ఉంటున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ నాలుగురోజుల కిందట రూ.7.50లక్షల నగదుతో ఉన్న కవర్‌ను టేబుల్ మీద పెట్టి మర్చిపోయాడు. మరుసటిరోజు పనిమీద బయటకు వెళ్లిన తర్వాత నగదుతో ఉన్న కవర్ గురించి గుర్తుకువచ్చింది. ఇంట్లో పెట్టాను కదా ఎక్కడ పోతుందనే ధీమాగా ఉన్న జైపాల్ యాదవ్ పని బిజీలో పట్టించుకోలేదు. కాగా, శనివారం సాయంత్రం ఇంట్లో డబ్బు కోసం చూడగా కనిపించలేదు. కుటుంబసభ్యులను వాకబు చేయగా తమకు తెలియదని చెప్పారు. దీంతో తన ఇంట్లో చోరీ జరిగిందంటూ జైపాల్ యాదవ్ శనివారం రాత్రి ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని ఇంట్లో పనిమనుషులు తీశారా? లేక మరెవరైనా తీశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. సమీపంలోని సీసీ పుటేజీని పరిశీలిస్తున్నారు.

### సస్పెండైనా బుద్ధి మారలేదు

**వ్యభిచార గృహంపై దాడి.. నిందితుడి అరెస్ట్**

సిటీబ్యూరో, డిసెంబర్ 15(నమస్తే తెలంగాణ): వ్యభిచార గృహం నిర్వహిస్తున్న ఓ సస్పెండైన పోలీస్ కానిస్టేబుల్‌ను నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. 1998వ బ్యాచ్‌కు చెందిన భూక్యా కల్యాణ్ వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తూ పట్టుబడటంతో అధికారులు 2018లోనే సస్పెండ్ చేశారు. అప్పటి నుంచి సస్పెన్షన్‌లోనే ఉన్నాడు. దీంతో సస్పెండైన తరువాత తిరిగి వ్యభిచార గృహాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు ఆ దిశగా విచారణ చేపట్టారు. సికింద్రాబాద్ సింధీ కాలనీలో ఓ అపార్టుమెంట్‌లో ప్రస్తుతం తన అడ్డాను నిర్వహిస్తున్నాడని నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదులు బృందానికి విశ్వసనీయ సమాచారం అందగా ఆ ఇంటిపై దాడి చేశారు. ఆ ఇంట్లో ఉన్న బాధితులను రెస్క్యూ హోంకు తరలించగా.. నిర్వాహకుడితోపాటు ఓ విటుడిని అరెస్ట్ చేసి తదుపరి విచారణకు రాంగోపాల్‌పేట్ పోలీసులకు అప్పగించారు.

### ఫోన్ విషయంలో అన్నదమ్ముళ్ల మధ్య గొడవ

**తండ్రి మందలింపు.. కుమారుడి ఆత్మహత్య**

జవహర్‌నగర్, డిసెంబర్ 15: ఫోన్ విషయంలో అన్నదమ్ముళ్లు గొడవపడ్డారు.. వద్దని తండ్రి మందలించడంతో మనస్తాపం చెందిన కుమారుడు యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి జమ్మిగడ్డలో చోటుచేసుకున్నది. ఎస్‌హెచ్‌వో సైదయ్య తెలిపిన ప్రకారం.. జమ్మిగడ్డలోని బీజేనగర్ కాలనీలో వెంకటేశ్, భార్య, ముగ్గురు కుమారులైన సాయికుమార్, సాయికృష్ణ, రాకేశ్‌తో కలిసి నివస్తున్నారు. ఈనెల 14వ తేదీన ఫోన్ విషయంలో కుమారులు గొడవపడుతుండటంతో వద్దని తండ్రి వారించాడు. ఈ క్రమంలో పెద్దవాడు అయిన సాయికృష్ణను ఏదో ఒక పని చేసుకుని బతకాలని చెప్పడంతో మనస్తాపం చెందిన సాయికృష్ణ(18) రాత్రి 9గంటల సమయంలో యాసిడ్ తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు గుర్తించి సాయికృష్ణను సమీపంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ దవాఖానకు తరలించాలని వైద్యులు సూచించడంతో అక్కడికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### బాలికకు వేధింపులు.. ఒకరి అరెస్ట్

మన్సూరాబాద్, డిసెంబర్ 15: ఓ బాలికను వేధింపులకు గురి చేస్తున్న ఓ వ్యక్తిని ఎల్బీనగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా, పోలేపల్లి, సాయికృష్ణానగర్‌కు చెందిన యలమల్ల సతీశ్(34) గత కొన్ని రోజులుగా మన్సూరాబాద్‌లో నివాసముండే అక్క, బావల వద్ద ఉంటున్నాడు. సతీశ్ జులాయిగా తిరుగుతూ మన్సూరాబాద్‌కు చెందిన బాలిక(13) వెంటపడుతూ వేధించేవాడు. అంతటితో ఆగకుండా బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడటం, రాత్రి సమయాల్లో ఇంటి తలుపులు కొడుతూ సదరు బాలిక పేరును గట్టిగా అరుస్తూ కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. దీంతో సతీశ్ ప్రవర్తనపై అక్టోబర్ నెలలో బాలిక తల్లిదండ్రులు ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న సతీశ్ దుబాయ్‌లో ఉండే అక్క వద్దకు వెళ్లిపోయాడు. గొడవ సద్దుమణిగిందనుకున్న సతీశ్ వారం రోజుల కిందట తిరిగి మన్సూరాబాద్‌కు వచ్చాడు. దీంతో ఎల్బీనగర్ పోలీసులు సతీశ్‌ను ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

# బిగ్‌బాస్ ఫైనల్‌కు భారీ బందోబస్తు

బంజారాహిల్స్, డిసెంబర్ 15: బిగ్‌బాస్ ఫైనల్స్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా జూబ్లీహిల్స్ రోడ్ నం.5లోని అన్నపూర్ణ స్టూడియోస్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. గత ఏడాది బిగ్‌బాస్ టైటిల్‌ను పల్లవి ప్రశాంత్ గెలిచిన సందర్భంగా భారీఎత్తున హింస చెలరేగడంతోపాటు ఆస్తులు ధ్వంసం కావడం, పోలీసుల సూచనలు బేఖాతరు చేస్తూ వేలాది మంది అభిమానులు ర్యాలీ నిర్వహించడం తదితర ఘటనలు జరిగిన సంగతి తెలిసిందే. గత ఏడాది అనుభవాలను దృష్టిలో పెట్టుకుని శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగవద్దనే ఉద్దేశంతో నిర్వాహకులకు ముందుగానే హెచ్చరికలు జారీ చేశారు. బిగ్‌బాస్ పోటీదారులను ఒకేసారి బయటకు పంపించవద్దని, ఫైనల్స్ ముగిసిన వెంటనే వేర్వేరుగా వారిని పంపించాలని సూచించారు. ఎలాంటి ఊరేగింపులు, ర్యాలీలకు అనుమతి లేదని, అన్నపూర్ణ స్టూడియోస్ చుట్టుపక్కల నిషేధాజ్ఞలు విధించారు. వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్‌కుమార్, జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అదనపు బలగాలను రప్పించారు. బంజారాహిల్స్ రోడ్ నం.2 నుంచి అన్నపూర్ణ స్టూడియోస్‌కు వచ్చే రోడ్డులో రాకపోకలను నియంత్రించి బారికేడ్లు ఏర్పాటు చేశారు. కృష్ణానగర్ నుంచి అన్నపూర్ణ స్టూడియోస్‌కు వెళ్లే రోడ్డును బారికేడ్లతో మూసేశారు. ఎక్కువ మంది గుమికూడకుండా ఎప్పటికప్పుడు వారిని చెదరగొట్టారు. ఎలాంటి అల్లర్లు జరిగినా బిగ్‌బాస్ నిర్వాహకులదే బాధ్యత అని స్పష్టమైన హెచ్చరికలు చేశారు.

### అన్నపూర్ణ స్టూడియో వద్ద నిషేధాజ్ఞలు



అన్నపూర్ణ స్టూడియో సమీపంలో బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి

## మృదంగ విద్వాంసుడు ఎల్లా వెంకటేశ్వరరావుకు సన్మానం

రవీంద్రభారతి, డిసెంబర్ 15: భారతీయ శాస్త్రీయ సంగీతానికి ఎల్లా వెంకటేశ్వరరావు చేసిన కృషి అమోఘమని, మృదంగ ప్రపంచంలో ఒక మార్గదర్శకుడని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రవీంద్రభారతిలోని ప్రధాన మందిరంలో ప్రముఖ మృదంగ సంగీత విద్వాంసుడు ఎల్లా వెంకటేశ్వరరావుకు ఆయన శిష్య బృందం ఆదివారం ఘనంగా జూబ్లీ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జూపల్లి కృష్ణారావు, విశ్రాంత ఐఏఎస్ అధికారి (ఏపీ మాజీ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం, పలువురు సంగీత విద్వాంసులు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి ఎల్లా వెంకటేశ్వరరావు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. ఎల్లా వెంకటేశ్వరరావు దేశ విదేశాల్లో తన అద్భుతమైన మృదంగ ప్రదర్శనలతో ఎంతో మందిని అలరించిన గొప్ప సంగీత మృదంగ విద్వాంసుడని కొనియాడారు. పద్మశ్రీ ఎల్లా వెంకటేశ్వరరావు సంగీత రంగానికి 75 ఏళ్లుగా చేసిన విశిష్ట సేవలకు గాను ఆయన శిష్య బృందం జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఎల్లా వెంకటేశ్వరరావు సంగీత మృదంగ విద్వాంసుడుగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయలో ప్రొఫెసర్‌గా, డీన్‌గా ఎన్నో ఏండ్లు పనిచేసి మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించారని చెప్పారు. అంతే కాకుండా ఆయన ఎన్నో అవార్డులు, రివార్డులు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆర్థిక వేత్త కోస్టల్ ఇండియా డెవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ జీవీఆర్ శాస్త్రి, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఆకెళ్ల విభీషణ శర్మ, మేడిపల్లి దక్షిణామూర్తి తదితరులు పాల్గొన్నారు.

